నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, శుక్రవారం 19 జనవరి 2024 | SANGAREDDY

గురువారం రంగనాయకసాగర్‌లోకి పంపింగ్ అవుతున్న జలాలు

రంగనాయక సాగర్‌లోకి నీటి పంపింగ్

నీటి విడుదలకు సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషి

- నీటిని పంపింగ్ చేయాలని మంత్రికి లేఖ, ఫోన్‌లో మరోమారు విజ్ఞప్తి
- నీటి విడుదలతో హరీశ్‌రావుకు రైతుల కృతజ్ఞతలు

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, జనవరి 18: యాసంగికి సాగు నీళ్లు లేక ఆందోళన పడుతున్న రైతులను చూసి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వయంగా కలిసి లేఖ అందించారు. అయినా స్పందించకపోతే మరోసారి ఫోన్‌లో విన్నవించారు. ఈ మేరకు మంత్రి అధికారులతో చర్చించి రంగనాయకసాగర్‌లోకి అనంతగిరి రిజర్వాయర్ నుంచి ఒక పంపు ద్వారా గురువారం నీటిని పంపింగ్ చేశారు. మూడు రోజుల పాటు రంగనాయక సాగర్‌లోకి నీటిని పంపింగ్ చేయనున్నారు. యాసంగికి త్వరలో కాల్వల ద్వారా నీళ్లు అందనున్నాయి. నీటి పంపింగ్ చేయించిన మంత్రి ఉత్తమ్‌కు రైతుల పక్షాన ఎమ్మెల్యే హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

ఫలించిన హరీశ్‌రావు కృషి..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పటి నుంచి మూడేండ్లుగా రంగనాయక సాగర్ ద్వారా యాసంగి పంటకు నీళ్లు ఇచ్చారు. ఈసారి కొత్త ప్రభుత్వం ఏర్పడి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉంది. నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి రాగా.. వెంటనే రంగనాయక సాగర్‌లోకి నీళ్లు ఇవ్వాలని రాష్ట్ర మంత్రికి స్వయంగా లేఖ రాశారు. అయినా స్పందించక పోవడంతో మరోసారి రైతుల పక్షాన ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. దీంతో రంగయనాయక సాగర్‌లోకి నీళ్లు పంపింగ్ చేశారు. తన్నీరు హరీశ్‌రావు కృషి ఫలితం.. రైతుల పక్షాన పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నీళ్లు వచ్చాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తన్నీరు హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నిందితులను చూపుతున్న మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి

అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

- బేస్‌బ్యాండ్ యూనిట్లు చోరీ
- ఢిల్లీ, బంగ్లాదేశ్‌ల్లో విక్రయాలు
- ఏడుగురు నిందితులకు రిమాండ్
- పరారీలో మరో నలుగురు

మెదక్ అర్బన్, జనవరి 18: ఎయిర్‌టెల్ సెల్ టవర్‌లలో బేస్‌బ్యాండ్ యూనిట్లు దొంగిలించి ఢిల్లీ, బంగ్లాదేశ్‌లకు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వివరాల్లోకి వెళితే చేగుంట మండలం రామాంతపూర్, రాంపూర్ సెల్ టవర్ల వద్ద రూ. 25లక్షల విలువగల బేస్‌బ్యాండ్ యూనిట్ల దొంగతనం జరిగిందని, ఈ నెల 13న ఎయిర్‌టెల్ సెల్‌టవర్ పెట్రోలింగ్ ఉద్యోగి నాగరాజు చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కామారెడ్డి జిల్లాకు చెందిన మాసాని మహేశ్ ఎయిర్‌టెల్ బేస్‌బ్యాండ్ యూనిట్ల సప్లయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మహేశ్‌తో కలిసి అదే జిల్లాకు చెందిన సంతోష్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రాజుగౌడ్ ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరి నుంచి హైదరాబాద్‌కు చెందిన మాసాని అనిల్, మహ్మద్ అఫ్రోజ్, కామారెడ్డికి చెందిన పాగిడిపల్లి అశోక్ బేస్‌బ్యాండ్ యూనిట్లను తక్కువ ధరకు ముగ్గురు కలిసి ఢిల్లీ, బంగ్లాదేశ్‌లలో విక్రయించేవారని తెలిపారు. మరో నలుగురు నిందితులు హైదరాబాద్‌కు చెందిన మాసాని బాగులు, మాసాని శేఖర్, మహ్మద్ అబ్బు, చాంద్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీరంతా సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, సైబరాబాద్ పరిధుల్లో సంవత్సరం నుంచి ఎయిర్‌టెల్ బేస్‌బ్యాండ్ యూనిట్లు దొంగతనం చేస్తున్నట్లు వివరించారు. నిందితులపై అన్ని జిల్లాల్లో కలిపి 26 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. బేస్‌బ్యాండ్ యూనిట్ల విలువ 5జీ అయితే రూ.3 నుంచి 5 లక్షలు, 4 జీ రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నిందితుల నుంచి ముషీరాబాద్, మేడ్చల్ ప్రాంతాల్లో రూ.6,75,000 విలువ గల సామగ్రి, చేగుంట పరిధిలో బెలెనో కారు, హుండ్యాయ్ గ్రాండ్ ఐ10, హోండా షైన్ బైక్, టయోటా ఇన్నోవా కారు, 7 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రామాయంపేట సీఐ, చేగుంట, తూప్రాన్ ఎస్సై, సిబ్బంది ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

- ఈ నెల 20, 21న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 18(నమస్తే తెలంగాణ): రెండు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. 1 జనవరి 2024 వరకు 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, సరైన గుర్తింపు కార్డు తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పేరు నమోదు చేసుకోవాలన్నారు. చిరునామా, ఫొటో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, మరణించిన వారి వివరాలు రికార్డు చేయాలని సూచించారు. ఫామ్ 6,7,8లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వారు దగ్గరలోని తహసీల్, ఆర్డీఓ కార్యాలయాల్లో కూడా తమ పేరు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొత్త ఓటరుగా నమోదు కావడానికి ఇదే చివరి అవకాశమని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మెదక్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

అన్నదాతల్లో నమ్మకం పెంచాలి

- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటా
- ఒక్క ఫోన్‌కాల్‌తో మీ ముందుంటా..
- త్వరలోనే కేసీఆర్‌తో అందరినీ కలిపిస్తా
- ఏడాదిలోపే ప్రజలు మనల్ని అర్థం చేసుకుంటారు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సాగునీళ్లు ఇస్తారో లేదోనని ప్రభుత్వంపై రైతుల్లో అపనమ్మకం పర్వడింది

గజ్వేల్‌లో బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, జనవరి 18: ప్రభుత్వం యాసంగిలో సాగుకు నీళ్లు ఇస్తదో లేదో అనే అపనమ్మకం రైతుల్లో ఏర్పడిందని, దీంతో రైతులు సాగుకు వెనుకడుగు వేస్తున్నారని, వెంటనే రైతుల్లో విశ్వాసం, నమ్మకం కల్పించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం గజ్వేల్‌లోని శోభ గార్డెన్‌లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు ముఖ్య అథితిగా విచ్చేసి, ఆయన మాట్లాడారు. పోయిన యాసంగిలో పడిన నాట్లు ఇప్పటికీ పడలేదని, సాగు విస్తీర్ణం తగ్గుతున్నదని, రైతులకు సాగు నీరు, 24 గంటల కరెంట్, రైతుబంధు నగదు ఎప్పుడిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగు విస్తీర్ణం వివరాలను వెంటనే ప్రజల ముందు పెట్టాలన్నారు. ఏడాదిలోనే ప్రజలు మనల్ని అర్థం చేసుకునే రోజులు వస్తాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అద్భుతమై విజయాలు సాధించామని, రైతులకు సాగునీళ్లు అందించి మూడు పంటలు పండించుకునే అవకాశాల్ని కల్పించామన్నారు. కేసీఆర్ ఎప్పుడు ప్రజల కోసం ఆలోచించే నాయకుడన్నారు. సాగునీళ్లను కింద నుంచి పైకి తీసుకొచ్చి చరిత్ర సృష్టించారన్నారు.

అంతిమ విజయం కేసీఆర్‌దే..

రెండు జాతీయ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా, మత చిచ్చు పెట్టినా గొప్ప విజయాన్ని అందించిన గజ్వేల్ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. చాలా కుట్రలు చేసి 154 మంది అభ్యర్థులు నామినేషన్లు వేస్తే, అందులోంచి 47 మంది పోటీలో ఉన్నారని, వీరికోసం నాలుగు ఈవీఎంలు కేటాయించడంతో 18,750 ఓట్లు చిత్తిపోయాయన్నారు. కారును పోలిన రోడ్డు రోలర్‌తో ప్రతిసారి నష్టం జరుగుతున్నదన్నారు. ఇన్ని కుట్రలు జరిగినా 45 వేల మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గజ్వేల్‌లో గెలిచిన పార్టీదే రాష్ట్రంలో ఎప్పుడూ అధికారం వచ్చేదని, కానీ ఈసారి తలకిందులైందన్నారు. మూడోసారి కేసీఆర్‌ను గెలిపించుకున్న ఘనత గజ్వేల్ ప్రజలకే దక్కిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కేసీఆర్ తాగు, సాగునీరు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. బీఆర్ఎస్ హయాంలో హత్యా రాజకీయాలు, పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగడం తగ్గాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమ కేసులు పెట్టి చరిత్రను తిరగరాస్తున్నదన్నారు. ప్రజల బాధలు పట్టించుకోకుండా నెల రోజుల్లోనే కుట్రలు, కుతంత్రాలతో బెదిరింపులకు పాల్పడుతూ క్రిమినల్ కేసులు పెట్టిస్తున్నారన్నారు. కుట్రలు, కుతంత్రాలు వదిలి ప్రజలకు తాగు, సాగునీరు, రోడ్ల అభివృద్ధి చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజులకే పీఏసీఎస్, మున్సిపల్ చైర్మన్లను దింపడమే తరువాయిగా ముందుకెళ్లుతున్నరన్నారు. కేసీఆర్ తీసుకొచ్చిన ఎస్‌జీఎఫ్, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ పనులు ఆపేశారని, ఈ నిధులను వెనక్కి తీసుకుపోయేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. చేతనైతే ఎక్కువ నిధులు తెచ్చి పనులు చేపట్టాలన్నారు.

త్వరలోనే మీ ముందుకు కేసీఆర్..

త్వరలోనే మీ అందరి ముందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వస్తారని హరీశ్‌రావు అన్నారు. 15 రోజుల్లో క్యాంపు కార్యాలయానికి వస్తారని, వీలుకాని సమయంలో వ్యవసాయక్షేత్రానికి తీసుకెళ్లి అందరితో కలిపిస్తానన్నారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో కార్యకర్తలందరికీ అండగా ఉంటానన్నారు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే మీముందుకొస్తానన్నారు. 24 గంటలు ఎప్పుడు నా ఇంటి తలుపులు మీ కోసం తెరిచి ఉంటాయని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. పోరాటాలు తమకేమీ కొత్తవి కాదని, తాను హైదరాబాద్‌లో వెళ్లని పోలీస్‌స్టేషన్ లేదని, మెదక్ జైల్లో నాలుగు రోజులు ఉన్నానని అన్నారు. వర్గల్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేసి, పరిశ్రమల్లో ఉద్యోగాలు తీసేయించారని హరీశ్‌రావు దృష్టికి యువకులు తీసుకొచ్చారు. వచ్చే అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరింట్లో మనవాళ్లే ఎమ్మెల్యేలుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, రాష్ట్ర ఎంపీటీసీ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు రాజమౌళి, రవీందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, నాయకులు గాలి అనిల్‌కుమార్, జుబేర్‌పాషా, శేఖర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, మర్కూక్ కరుణాకర్‌రెడ్డి, నవాజ్‌మీరా, ఉడేం కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

మల్లన్న క్షేత్రంలో రైల్వేస్టేషన్

మంజూరు చేస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు

చేర్యాల, జనవరి 18: కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం సమీపంలో రైల్వే హాల్టింగ్ స్టేషన్ మంజూరు చేస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మనోహరాబాద్– కొత్తపల్లి రైల్వే లైన్ పనులు ప్రారంభించినప్పటి నుంచి కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని అధికార, ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు. దీనిపై స్పందించిన రైల్వే బోర్డు ఉన్నతాధికారులు రైల్వే హాల్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

నేటికీ అమలుకాని ఆరోగ్యశ్రీ

– యాదవరెడ్డి, ఎమ్మెల్సీ

ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రెండు గ్యారెంటీల్లో ఒకటైన ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ పెద్దల ఊకదంపుడు ఉపన్యాసాలే తప్పా ఎక్కడా అమలుకావడం లేదని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. స్వయంగా తానే సచివాలయంలో సంబంధిత శాఖాధికారులను కలిస్తే ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తన వద్దే వంద ఫైళ్లు సిద్ధంగా ఉన్నాయని, అధికారుల నుంచి సరైన సమాధానం రావడం లేదన్నారు. హరీశ్‌రావు నాయకత్వంలో ఉమ్మడి జిల్లాలోని పదింట్లో ఏడు స్థానాలు గెలుచుకున్నామని, హైకమాండ్ సూచనల మేరకు రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన అన్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధిలో ఒక్కశాతం పనులు చేపట్టండి

– వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్

కేసీఆర్ చేసిన అభివృద్ధిలో ఒక్కశాతం పనులు చేపట్టినా వారికి సన్మానం చేస్తామన్నారు. గజ్వేల్‌లో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో హరీశ్‌రావు కష్టపడిన విధంగా అన్ని జిల్లాలో నాయకులు కష్టపడి పనిచేస్తే 70 నుంచి 80 అసెంబ్లీ స్థానాలు వచ్చేవన్నారు. ప్రజలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా కేసీఆర్ అన్ని విధాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. గ్రామాల్లో తమ పార్టీ కార్యకర్తలపై దుర్మార్గంగా నాయకులను ఉసిగొల్పుతున్నారని, ప్రతీ కార్యకర్తకు అండగా నిలబడుతామన్నారు.

‘అద్దంకి’కి ఎమ్మెల్సీ ఇవ్వాలి

- మెదక్‌లో మాలమహానాడు ఆందోళన
- సెల్‌టవర్ ఎక్కిన ఇద్దరు వ్యక్తులు
- రెండు గంటలు హల్‌చల్

మెదక్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ పేరును వెంటనే ఎమ్మెల్సీ లిస్టులో చేర్చి దళిత జాతికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ పట్టణ మాల మహానాడు అధ్యక్షుడు బత్తుల ప్రసాద్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి వెంకటేశ్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో ఉన్న సెల్ టవర్ ఎక్కి రెండు గంటల పాటు హల్‌చల్ చేశారు. రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అద్దంకి దయాకర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడితే తప్ప కిందికి దిగమని పట్టుబట్టారు. అయితే, పిల్లి సుధాకర్ సెల్‌టవర్ ఎక్కిన ఇద్దరికి ఫోన్‌చేసి మాట్లాడి నచ్చజెప్పడంతో ఎట్టకేలకు సెల్ టవర్ నుంచి కిందికి దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం చాలా బాధాకరమన్నారు. దళిత బహుజనులను నిరాశకు గురిచేసిందన్నారు. గతంలో అద్దంకి దయాకర్‌కు తుంగతుర్తి టికెట్ ఇస్తామని చెప్పి చివరి క్షణంలో వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి ఎమ్మెల్యేగా అవకాశమిచ్చారని, అదే తరహాలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఇస్తామని ప్రకటించి చివరి క్షణంలో వేరే వ్యక్తి పేరు ఖరారు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేసి చట్టసభల్లోకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగంగా మాట ఇచ్చి ఈరోజు నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే అద్దంకి దయాకర్ రావు పేరును ఎమ్మెల్సీ లిస్టులో చేర్చే విధంగా కాంగ్రెస్ హై కమాండ్ పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

మెదక్‌లో సెల్‌టవర్‌పైకెక్కిన ప్రసాద్, వెంకటేశ్

అభయహస్తం ఆన్‌లైన్ పూర్తి

- మెదక్ జిల్లాలో 2,25,680 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు
- ఇక మిగిలింది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ

మెదక్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6 వరకు అభయహస్తం దరఖాస్తులు స్వీకరించింది. ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ బుధవారంతో పూర్తయ్యింది. మెదక్ జిల్లావ్యాప్తంగా 469 పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలకు సంబంధించి 2,25,680 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీటిలో మహాలక్ష్మి పథకం కింద 1,87,883 దరఖాస్తులు, రూ.500 వంట గ్యాస్‌కు 1,95,377 దరఖాస్తులు, ఎకరాకు రూ.15000 పెట్టుబడి సాయం కోసం 1,45,777, కౌలు రైతుల నుంచి 6579, ఇందిరమ్మ ఇండ్లకు 1,93,169, ఇంటి స్థలం కోసం తెలంగాణ ఉద్యమకారుల నుంచి 2226, 250 గజాల స్థలానికి 405, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు 1,74,016, దివ్యాంగుల పింఛన్లు 4685, ఇతర పింఛన్లకు 46,960 దరఖాస్తులు వచ్చాయి.

నేడు ఐఐటీహెచ్‌లో ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభం

సంగారెడ్డి జనవరి 18 (నమస్తే తెలంగాణ): నేడు ఐఐటీ హైదరాబాద్‌లో జాతీయ స్థాయి మెగా ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభంకానున్నది. కేంద్ర విద్యాశాఖ ఏటా నిర్వహించే మెగా ఇన్నోవేషన్ ఫెయిర్ ఈసారి సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో జరగనున్నది. శుక్ర, శనివారాల్లో ఇన్వెంటివ్–2024 పేరిట మెగా ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించనున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ శుక్రవారం ఆన్‌లైన్‌లో ఈ ఫెయిర్‌ను ప్రారంభించనున్నారు. ఈ ఫెయిర్‌లో 23 ఐఐటీలు, బెంగళూరులోని ఐఐసీ, ఐఐఐటీలు, ఎన్ ఐటీలు పాల్గొననున్నాయి. 50కి పైగా సాంకేతిక విద్యాసంస్థలు 120 ఆవిష్కరణలు ప్రదర్శించనున్నాయి. వైద్యం, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షణ, అంతరిక్షం, పరిశ్రమలు, సుస్థిరమైన టెక్నాలజీ అంశాల్లో 53 సాంకేతిక విద్యా సంస్థలు తమ 120 నూతన ఆవిష్కరణలను ప్రదర్శించనున్నాయి. ఈ ఫెయిర్‌కు దేశంలోని 2000 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ విద్యా సంస్థలు తమ కొత్త ఆవిష్కరణలను ఈ సెంటర్‌లో ప్రదర్శించనున్నాయి. ఈ ఫెయిర్ ప్రారంభించేందుకు ఐఐటీ హైదరాబాద్ గవర్నింగ్ బాడీ చైర్మన్ బీవీఆర్.మోహన్‌రెడ్డి, ఐఐటీ డైరక్టర్ బీఎస్ మూర్తి, సాంకేతిక విద్యా సంస్థల డీన్‌లు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు.

ఘనపూర్‌లో నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సర్కారు బడుల్లో కార్పొరేట్ వసతులు

- సీఎస్సార్ నిధులతో నాణ్యమైన విద్య
- టెన్త్ పరీక్షలకు ఉచిత పరీక్షా సామగ్రి అందజేస్తాం
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 18: సర్కారు బడుల్లో కార్పొరేట్ వసతులు కల్పిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ఘనపూర్‌లో గ్లాండ్ ఫార్మా రూ.4కోట్ల సీఎస్సార్ నిధులతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే సర్పంచ్ కావ్యా కాశిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు సీఎస్సార్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది ఏడువేల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారికి మోటివేషల్ క్లాసులతోపాటు టెన్త్ పరీక్షలకు ఉచిత పరీక్షా సామగ్రి అందజేస్తామన్నారు. ఘనపూర్ గ్రామంలో నూతన పాఠశాలను నిర్మించిన గ్లాండ్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యాన్ని, అధికారులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా సీఎస్సార్ విభాగం అధిపతి రఘురామన్, ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కావ్యాకాశిరెడ్డి, ఎంపీటీసీ నీనా చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విఠలయ్య, ఎంఈవో పీపీ రాథోడ్, రాఘవేంద్ర, పాఠశాల హెచ్ఎం నాగేశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★సిద్దిపేట హైవేలో ప్రముఖ కార్ల షోరూంల యందు పనిచేయుటకు "సెక్యూరిటీ గార్డులు" కావలెను. పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత మంచి జీతం ఇవ్వబడును. స్వామి: 9392143108, 9652520827. NT-313978

★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073. NT-319415-All

CHANGE OF NAME

★I, S. RANI, W/o. N. Srinivas, Aged 55 Yrs., Occ: House Wife, R/o. H.No. 1-8, Nandikandi Village, Sadasivapet Mandal, Sangareddy Dist., T.S-502 306, have state that in My Husband's Passport My Name is mentioned as N.UMA RANI. So that both Names i.e., S. RANI @ UMA RANI are one & the same and belongs to me only. NT-NAR

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న ఒప్పందములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపి